ప్లీడరుగారింట్లో ఆ సంఘటన జరిగి 'కథ అడ్డం తిరిగిన' తర్వాత ఓ యిరవై ఏళ్ళు గడిచాయి...!

ఓ ముసలావిడ... జుట్టు నెరిసింది... తెల్లచీరె తలమీదకు వేసుకుంది. పొడవు చేతుల జాకెట్... అదీ తెలుపే... చేతిలో నల్ల అట్ట, రెక్సిన్ కవరు పుస్తకం, ఎల్లమ్మతోట దగ్గర బస్సు దిగి, స్కూలు ప్రక్క చర్చికేసి నడుస్తోంది...!

అటు కోర్టువైపు నుండి నడిచొస్తున్న మనిషి.. వయస్సు నాలుగో పడిలో పడివుంటుంది. చెవిలో పువ్వు.. నుదుటను తిలకం బొట్టు.. చంకలో మడిచిన గొడుగు.. చొక్కా పంచెలో

తదనంతరం

డా॥ కె. నిర్మలాదేవి

వేసి తోలు 'బెల్టు' పెట్టాడు. చిన్న గిరజాలు. బాణీలు వూదుకుని నోట్లో విసురు కుంటున్నాడు.. ఎదురుగా వచ్చిన తెల్లచీరె మనిషిని తీక్షణంగా చూసి, ఆగిపోయాడు..! ఆవిడ కూడా ఎక్కడో చూసినట్లుందని ఒక్క క్షణం తేరిపారచూసింది.

'తమరిది విజీనగరం కదూ' అన్నాడతను.

''అవును బాబూ.. మీరెవరో పోల్చుకోలేదు..' అంది ఆవిడ చిరునవ్వుతో.

'నేనక్కా వెంకటేశాన్ని. మీరు మధురవాణి కదూ..'

'అవును బాబూ.. ఏ వెంకటేశమో గుర్తు రావడంలేదు నాయనా..'

'విజీనగరంలో గిరీశంగారి దగ్గర చదూకొనే వాణ్ణి. గురూగారు పంపితే తమరింటికి కబుర్లు తెచ్చేవాణ్ణి..'

'ఆ వెంకటేశానివా.. ఎంతవాడివయ్యావు నాయనా.. పోల్చుకోలేకపోయాను.. ప్రభువు దయవల్ల ఇన్నాళ్ళకు కనిపించావు. బావున్నావా తండ్రీ.. ఏం చేస్తున్నావ్... పిల్లలా'

'బావున్నానక్కా.. ప్లీడరీ గుమాస్తా చేస్తున్నాను.. ముగ్గురు ఆడపిల్లలు. అన్నట్లక్కా మా ప్లీడరుగారు ఎవరనుకున్నావ్.. గురూగారూ, బుచ్చక్కా ఉడాయించబోయినప్పుడు తీర్పు చెప్పారే.. సౌజన్యారావుగారని.. ఆయన సబ్ జడ్జీ చేసి కాలం చేసారక్కా. వారబ్బాయి దగ్గరే నేను గుమాస్తా. చాలా మంచివారు.'

'అవును నాయనా. నాకూ గిరీశంగారికీ జ్ఞానోదయం చేసిందాయనే. ప్రభువు ఆయనాత్మకు శాంతి కల్గిస్తాడు.'

'మతం పుచ్చుకున్నావా అక్కా!'

'అవున్నాయనా..అనాథ శరణాలయంలో దీనులకు 'వాక్యం' చెప్పుకుని ఆయన సేవలో కాలం వెళ్ళబుచ్చుతున్నాను. గిరీశంగారు కూడా ఆయన సేవలోనే వుండివుంటారు..'

'లేదక్కా! గురూగారు ఈ ఊళ్ళోనే వున్నారు.'

'ఈ ఊళ్ళోనా. బావున్నారా?'

'ఏం బావులే మధురక్కా. బుచ్చికి వూష్ణ మొచ్చి చచ్చిపోయిందని తెలిసి ఆయన తల్లడిల్లిపోయి మంచాన పడ్డారటక్కా. ఆనక పక్షవాత మొచ్చింది. కాలూ, చెయ్యి పడిపోయింది. రక్తపోటూ, మధుమేహమూ ప్రకోపించాయష... నాటు వైద్యం గుణం సూయించకపోతే ఎవరో దొరల ఆసుపత్రిలో చేర్చారు. ఏణ్ణర్థం నుంచి విశాఖపట్నంలోనే తీసుకుంటున్నారు.'

'అయ్యో... అలాగా. దైవ కృపవల్ల ఆయన కోలుకుంటారు.

'నీ పేరు అనేకమార్లు కలవరించారక్కా. ఒక్కమాటొచ్చి చూడక్కా.'

'తప్పకుండా నాయనా. రేపు సాయంత్రం వెళ్దాం. ఆయన కోసం ప్రార్థనలు చేయిస్తాను.'

'అన్నట్లక్కా మా నాయన అగ్నిహోత్రావధాన్లు కాలం చేసారు తెల్సా? ఆ తర్వాతే నాకు పెళ్ళయింది. కన్యాశుల్కం పుచ్చుకోలేదక్కా వాళ్ళు. మా ప్లీడరుగారే చేయించారు. అన్నట్లక్కా విజీనగరంలో ఓ కవీశ్వరుడుగారు గిరీశం గారి కథను నాటకం వ్రాసి వూరూరా వేయిస్తున్నారటక్కా!'

'అల్లాగా. ఆయన కథ నల్గురూ విని తరించవలసిందే. ఆయన దేవుని బిడ్డ. ఉత్తములు.'

'మొదట్లో నీ పాత్ర వద్దనుకున్నారట. ఆనక నీ పాత్రే గొప్పగా వ్రాసారట. నేనూ వున్నానటందులో. రామప్ప పంతులు దొంగ ముండాకొడుకని వ్రాసేరట.'

'అతనంతటివాడే, దుర్మార్గుడు!'

'అతన్నెవరో కత్తితో పొడిచి చంపేశారక్కా! కేసు మా ప్లీడరుగారే వాదించారు.'

'దుర్మార్గుల్ని ప్రభువు శిక్షిస్తాడు.'

'రేపు రా అక్కా. దొరల ఆసుపత్రి, పేదల వార్డు, అరవయ్యో బెడ్డు. పక్షవాతం గిరీశం గారంటే నర్సమ్మ చూపిస్తుంది. నేనక్కడే వుంటాను.'

** ** **

మరు రోజు... వెంకటేశం... ఆసుపత్రిలో..

'గురువుగారూ. గురువుగారూ.. కాలు ఇలా కూడదీసుకుని ఇటు తిరగండి. ఒక్కసారి ఎవరొచ్చారో పోల్చుకోండి..'

మధురవాణి చీరె చెంగుతో కళ్ళొత్తుకుంటోంది.

'ఎవరూ? కొత్త నర్సమ్మా. ఈవిడైనా వో 'సిగార్' ముక్క కాల్చుకోనిస్తుందటనా. ఈ సిస్టర్స్ డెవిల్సోయ్. బ్రతికుండగానే నన్ను చంపేస్తున్నారు.'

'నర్సు కాదండీ. మధురవాణి అక్కాయ్. మన మధురవాణి అక్కే. ఒక్కసారి తిలకించండి.'

'ఎవరూ? మధురమే. నా మధురమే.,. ఎన్నాళ్ళకు.. ఎన్నేళ్ళకు. బ్రతికే వున్నావా మధురం. ఈ 'రెచెడ్ ఫెలో' గిరీశంగాణ్ణి చూడాలని వచ్చావా.'

'బ్రతికే వున్నానండీ.. మిమ్మల్నీ స్థితిలో చూడ్డానికి ప్రభువు బ్రతికే వుంచాడు. మీ

వంట్లో ఎలా వున్నాది?'

'నీవొచ్చావు గదా. అంతా బాగయిపోతుంది. ఒకప్పుడు 'పరుగు పందెం' గోల్డు మెడల్ కొట్టేనని చెప్పా కదా. ఇప్పుడే కాలూ, చెయ్యీ నా అకార్యాలకు రోసి నాన్-కోపరేట్ చేస్తున్నాయి.'

'గురూగారూ. అక్క మతం పుచ్చు



కుందిష. ప్రభువు దీవెన తెచ్చింది.'

'ఈ గాడ్స్‌మీద నమ్మకం లేదోయ్. మిస్చువస్ ఫెలోస్. నన్ను కట్టి కుదుపు తున్నారు. మధురం వచ్చింది. చూశాను. హాయిగా చచ్చిపోతాను. ఎటూ మన 'ఎకౌంట్'లో పాపం బొంకులదిబ్బగా ఎదిగే వుంటుంది. మళ్ళీ 'మేన్'గా ఈ విశాఖపట్నం లోనే పుడతానోయ్. మా మధురం కోసమన్నా పుడతానోయ్.'

'అక్క ఇక్కడే పుడుతుందో లేదో..' వెంకటేశం!

'మా మతంలో పునర్జన్మ లేదు. మీ ఆత్మకు శాంతి కలుగుతుంది.'

'శాంతి లేదు మధురం. ఈ నర్సమ్మలు ఒక్కరోజున చంపేయకుండా ముక్క ముక్కలుగా ప్రాణం తీస్తున్నారు. ఈ సూది మందులు నరకం నుండి ఇంపోర్టు అయ్యాయని నమ్మకం. అన్నట్లు మధురం. నాకే మందూ వద్దు. నీ చల్లని చెయ్యి నా నుదుట మీద ఒక్కసారి వుంచు. అన్నీ తగ్గిపోతాయ్.'

'రోజూ నర్సమ్మ పూష్పం చూస్తుంది కదా' వెంకటేశం!

'నర్సమ్మ చేయి వేస్తే ఎరిఫెంట్ కాలుపెట్టి నట్లుంటుంది. మా మధురం శీతల హస్తంతో పునీతుణ్ణవుతాను. మధురం, నాయందు కరుణించి..'

మధురవాణి తన చేతిని గిరీశం నుదుటిమీద వేస్తుంది.

వెంకటేశం..

'ఆహా అపూర్వమైన సన్నివేశం. కవీశ్వరులు గారు ఇప్పుడుంటే నాటకాన్ని ఈ సంఘటనతో ముగించి వుందురు. ప్లీడరు గుమాస్తా ముండా కొడుకుని. ఆ అదృష్టం నాకు కలిగింది. కన్యా శుల్కం వెళ్ళిపోయినా, కాలం కదిలిపోయినా, మా గురువుగారి కథకు ఇదే అద్భుతమైన చివరి అంకం. మధురక్క కటాక్ష వీక్షణమే అందుకు మనోహరమైన ముగింపు.'

గిరీశం ప్రాణవాయువులు తమ కర్తవ్యం ముగిసినట్లుగా భౌతిక శరీరం నుండి తప్పు కున్నాయి!!